క్లుప్తంగా

ఈ-పంట ముసాయిదా జాబితా ప్రచురణ



ఈ-పంట ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ

బలిజిపేట: ఖరీఫ్ ఈ-పంట ముసాయిదా జాబితాను ఆర్బీకేల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. వెంగాపురంలో ప్రదర్శించిన జాబితాను సోమవారం ఆయన పరిశీలించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ముసాయిదా జాబితాపై గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించి తుది జామితాలను రూపొందించనున్నట్లు చెప్పారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి



డ్వామా పీడీ రామచంద్రరావుతో చర్చిస్తున్న రాహుల్‌నాయుడు

పార్వతీపురం టౌన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ కౌన్సిల్ మెంబర్ అల్లు రాహుల్ నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం డ్వామా పీడీ రామచంద్రరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవతం చేసేలా చర్యలు చేపట్టాని కోరారు. దీనిపై పీడీ సానుకూలంగా స్పందించారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పార్వతీపురంటౌన్: రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: పల్లెల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామం నుంచి పిన్నింటి రామినాయడువలస గ్రామం వరకు రెండు కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.75 లక్షల అంచనా వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమిపూజ



సీఎస్సార్ పేటలో ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

వీరఘట్టం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిదిమి, యు.వెంకమ్మపేట, సీఎస్సార్ పేట గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అధికారులు, గ్రామపెద్దలు భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ శ్రీహరిరావు సూచించారు. కార్యక్రమంలో చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, ఏఈ కళ్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

గరుగుబిల్లి: విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎంఈవో-1 దత్తి అప్పలనాయుడు సూచించారు. ఆయన ఇటీవల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మండలంలోని ఉల్లిభద్ర గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చూడాలన్నారు.

గంగమ్మ తల్లికి గర్భశోకం

- నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పిల్లకాలువలు, వాగులు, గెడ్డలనూ వదలని ఇసుకాసురులు
- కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి చోద్యం చూస్తున్న అధికారులు



పాచిపెంట మండలం చెరుకుపల్లి గెడ్డ వద్ద ట్రాక్టర్‌లోకి లోడు చేస్తున్న ఇసుక

సాలూరు: కూటమి ప్రభుత్వ పాలనలో గంగమ్మ తల్లి గర్భశోకంతో విలపిస్తోంది. ధనార్జనే లక్ష్యంగా కొంతమంది ఇసుకాసురులు చేస్తున్న అక్రమాలకు నియోజకవర్గంలో వాగులు, నదులు, చిన్న చిన్న గెడ్డలు విలవిల్లాడుతున్నాయి. ఇసుక సరఫరాపై ప్రభుత్వం ఇస్తున్న పబ్లిసిటీకి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గంలో ఇసుకాసురులు బరితెగించేశారు. ఉచిత ఇసుక ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెపుతున్నా.. లబ్ధిదారుకు ఇసుక చేరేసరికి తడిసిమోపెడు అవుతోంది. జిల్లాలో భామిని మండలం కాట్రగెడ్డ వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి సాలూరు పరిసర ప్రాంతాలకు ఇసుక రవాణాకు కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తూ లబ్ధిదారులను దోచుకుంటున్నారు.

యథేచ్ఛగా అక్రమ రవాణా..

ప్రభుత్వం కేటాయించిన స్టాక్ పాయింట్ నుంచి సాలూరుకు ఇసుక వచ్చే పరిస్థితి దాదాపు లేదు. దీంతో స్థానిక ఇసుకాసురుల అక్రమార్జనకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ప్రభుత్వం కేటాయించిన స్టాక్ పాయింట్ నుంచి మాత్రమే ఇసుక రవాణా ట్రాక్టర్‌లు, లారీల ద్వారా చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు తెలుపుతుండగా క్షేత్రస్థాయిలో దానికి భిన్నంగా జరుగుతోంది. గృహ నిర్మాణాలకు కేవలం నాటు బండ్ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలని, ట్రాక్టర్లు, లారీల ద్వారా చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా.. వారి హెచ్చరికలను ఇసుకాసురులు భేఖాతరు చేస్తున్నారు. నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ పరిసర ప్రాంతాల్లో స్థానిక వాగులు, నదులు, గెడ్డల నుంచి రాత్రీ పగలు తేడాలేకుండా ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు.



పాచిపెంట మండలంలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

సాలూరు పట్టణంతో పాటు పరిసర మండలాల్లో అనుమతులు లేని ఇసుక రీచ్‌ల నుంచి యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలు నడివీధుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నా అధికారులకు తెలియకపోవడం హాస్యాస్పదం. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఇసుక ట్రాక్టర్లను చూసీ చూడనట్లు విడిచిపెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఇసుకాసురులు దోచుకోవడంలో ఇక తగ్గేదేలే అంటు బరితెగిస్తున్నారు.

మంత్రి ఇంటి వద్ద షెడ్ నిర్మాణంకు..

పట్టణంలో పలుమార్లు ఇసుక ట్రాక్టర్లు వెళ్లడాన్ని గమనించి ఇసుక ఎక్కడకు తరలిస్తున్నారా అని సదరు ట్రాక్టర్ డ్రైవర్, యజమానులను అడిగితే అది నేరుగా మంత్రి సంధ్యారాణి ఇంటి వద్ద షెడ్ నిర్మాణం కోసం తీసుకువెళ్తున్నట్లు వారు తెలిపారు. అయితే ఆ ట్రాక్టర్లు టీడీపీ నాయకులవి, మంత్రి అనుయాయులవి కావడం గమనార్హం. ఇసుక తవ్వకాలకు అనుమతులు లేని స్థానిక గెడ్డల నుంచి ట్రాక్టర్ల ద్వారా మంత్రి ఇంటికే ఇసుకను తరలిస్తుండడంతో మంత్రికి నిబంధనలు వర్తించవా, లేదా ఇసుక అక్రమ రవాణా విషయం ఆమెకు తెలియదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



మంత్రి సంధ్యారాణి ఇంటి వద్దకు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

చినబజారులో మద్యం షాపు పెట్టొద్దు



చినబజారు వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని కోరుతున్న నాయకులు, విద్యార్థులు, ప్రజలు

సాలూరు: పట్టణంలో చినబజారు(మయూరి హోటల్) వద్ద వైన్, బార్ అండ్ రెస్టారెంట్‌లను ఏర్పాటు చేయొద్దని పట్టణ ప్రజలు, విద్యార్థులు, పలువురు నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం చినబజారు వద్ద నిరసన తెలియజేయడంతో పాటు, సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు దేవాలయాలకు వెళ్లే భక్తులు, నిత్యావసరాల కొనుగోలు కోసం వచ్చే ప్రజలతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందని, ఈ ప్రాంతంలో వైన్ షాపు, బార్ అండ్ రెస్టారెంట్ పెట్టడం వల్ల వారంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్, మున్సిపాలిటీ, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్.వై.నాయుడు, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్వతంత్రతను కాపాడాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని, ఇది ఏమాత్రం సహించేది లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. ఈమేరకు చలో ఐటీడీఏ పేరుతో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏకు రెగ్యులర్ పీఓ, డీడీ లేకపోతే పాలన ఎలా ముందుకుసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐటీడీఏకు వచ్చే నిధులను గిరిజనుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మరణాలు పాలకులకు పట్టడం లేదా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఎన్ఎంల నియామకం హామీపై మొదటి సంతకం ఏమయ్యిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రిని ప్రశ్నించారు. ఐటీడీఏ స్వతంత్రతను కాపాడాలని, పాలక వర్గం సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సమస్యలపై చర్చించాలని, పీఓ ఆధ్వర్యంలో గిరిజన స్పందన ఏర్పాటు చేయాలని కోరారు. వైటీసీ, గిరిజన గర్భిణుల వసతి గృహం సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కుక్, కమాటీ, వాచ్‌మెన్ తదితర ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ-3 పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, గిరిజన డీఎస్సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు గంగరాజు, ప్రభాకర్, సీతారాం వెల్లూరు, బంగార్రాజు, భాస్కరరావు, నాగార్జున, ముత్యాల, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎస్‌కే పాడు గ్రామంలో ఉన్న ఐటీడీఏ అడ్వంచర్ పార్క్‌లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.48 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు కురుపాం మండలంలోని మరిపల్లి, దురుబిల్లి గ్రామాల రోడ్ల నిర్మాణానికి ఆమె సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పల్లె పండగ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ పల్లె పండగ కార్యక్రమంలో శ్రీకారం చుట్టిన పనులను వచ్చే కొత్త సంవత్సరంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు ఎస్.సాల్మన్‌రాజు, జె.ఉమామహేశ్వరి, టీడీపీ కన్వీనర్లు పాడి సుదర్శనరావు, కొండయ్య, కోలా రంజిత్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ జి.శ్రీనివాసరావు, ఏఈ కె.మురళీధర్ పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని ఆర్తాం, గుణానపురం, దుగ్గి, కళ్లికోట గ్రామాల్లో ఏపీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అలమండ, పీటీ మండ, శిఖబడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి భూమిపూజ చేశారు. సర్పంచ్ చంటి, ఎంపీడీవో ఎస్.రమేష్ పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని రాయిమానుగూడ, దీసరిగూడ, పత్తికగూడ, గొయిది, నాయుడుగూడ, కుడ్డపల్లి పంచాయతీల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి భూమి పూజ చేసినట్లు ఎంపీడీఓ కె. గీతాంజలి తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీతానగరం: బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం వారం రోజుల పాటు నిర్వహించనున్న 'పల్లె పండుగ' వారోత్సవాలను ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సోమవారం ప్రారంభించారు. మండలంలోని సుమిత్రాపురం నుంచి వల్లరగుడబ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీరోడ్లు, బీటీరోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను అన్ని గ్రామాల్లో నిర్మించడం జరుగుతుందన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, రౌతువేణు గోపాలనాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమరావు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, పార్వతీపురం టీడీపీ నేతలు గొట్టాపు వెంకటనాయుడు, జి.చంద్రమౌళి, సీతానగరం, పార్వతీపురం, గరుగుబిల్లి మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బలిజిపేటలో..



బలిజిపేట: వెంగళరాయపురంలో సోక్‌పిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

బలిజిపేట: మండలంలో వెంగళరాయపురం, అంపావల్లి, నూకలవాడ గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంపావల్లిలో ఆంజనేయస్వామి గుడి వద్ద కమ్యూనిటీ సోక్‌పిట్, వెంగళరాయపురంలో ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద, నూకలవాడలో ఆర్బీకే వద్ద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసినట్లు ఏపీఓ కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పీఆర్ ఏఈ అంబేడ్కర్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సీతానగరం: ఇసుకను ఉచితంగా పంపిణీ చేసి భవన నిర్మాణ కార్మికులకు జీవనోపాధి కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లభ్యత ఎక్కువగా ఉన్నప్పటికీ అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీని వల్ల చాలా చోట్ల భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని అన్నారు. పనులు లేక కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయకుడు రామరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటరమణ, సంతోష్ కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సప్త ధాన్యాంకుర ద్రావణం తయారీపై అవగాహన



ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయ విధానం పర్యావరణానికి మేలు చేస్తుందని ఐసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు అన్నారు. మండలంలోని మిర్తివలసలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సప్త ధాన్యాంకుర ద్రావణం తయారీ, వినియోగాన్ని వివరించారు. పెసలు, మినుములు, ఉలవలు, బొబ్బర్లు, కందులు, శనగలు, నువ్వులు వంటివి ఒకొక్క రకం 100 గ్రాములు వంతున తీసుకుని వాటని 12 గంటల పాటు నీటిలో నానపెట్టాలి. ఆ తరువాత వాటిని వస్త్రంలో మూటకట్టి మొలకలు వచ్చిన తరువాత మెత్తగా పేస్టులా తయారుచేయాలన్నారు. ఈ పేస్టును 200 లీటర్ల నీటిలో వేసి ఐదు లీటర్ల గోమూత్రంను దానిలో కలపాలన్నారు. 24గంటలు పులియపెట్టిన తరువాత వరిచేనుకు పిచికారీ చేయడం వల్ల గింజ బరువుతో పాటు రంగు నాణ్యత పెరుగుతుందన్నారు. తెల్లకంకి, నల్లకంకి, పొల్లు గింజల సమస్య తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలి

- వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: ప్రతీ రోగికీ పూర్తిస్థాయిలో ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులో రోగుల ఆరోగ్య సమస్యల వివరాలు పరిశీలించారు. జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చేవారికి నిర్వహిస్తున్న పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, చికిత్స వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. రోగుల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజూ రోగ నిర్ధారణ పరీక్షలు ఏ మేరకు చేపడున్నారో, వాటి ఫలితాలు వివరాలు ల్యాబ్ రికార్డులో తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న ప్రతీ ఒక్కరికీ వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సీబీసీ ఎనలైజర్ ద్వారా నిర్వహిస్తున్న రక్త పరీక్షల నివేదికల్లో ఎవరికైనా ప్లేట్లెట్ సంఖ్య తక్కువగా గుర్తిస్తే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మందుల నిల్వలను తనిఖీ చేసి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు(నీలి రంగు) లభ్యతను పరిశీలించి అన్ని పాఠశాలలో అందుబాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. మందుల కాలపరిమితిని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రసవాలు గదిని పరిశీలించి ప్రతీ నెలా ఏ మేరకు సాధారణ కాన్పులు చేపడుతున్నారని సిబ్బందిని అడిగి, పార్చురిషన్ రిజిస్టర్‌లో తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.అనూష, సూపర్‌వైజర్స్ వెంకటనాయుడు, పార్వతీ శంకరరావు, జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రచారం ఫుల్.. పనులు నిల్

- గత ప్రభుత్వంలో మంజూరైన పనులకే నేడు పల్లె పండుగ పేరుతో శంకుస్థాపనలు
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: కూటమి ప్రభుత్వంలో ప్రచారం ఫుల్, పనులు మంజూరు నిల్ అని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ విమర్శించారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధిహామీ చట్టం-2005 నిబంధనల మేరకు ఉపాధిహామీ నిధులతో చేపట్టే పనులకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ తీర్మానం తప్పనిసరి అని, అనంతర ఎంపీపీ, కలెక్టర్ ఆమోదం పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధిహామీ పథకం ద్వారా నియోజకవర్గంలో నూతన పనులు మంజూరు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు కూటమి ప్రభుత్వం కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర పాచిపెంట మండలం పారమ్మకొండకు రోడ్డు మంజూరుచేశారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సంధ్యారాణి జూన్ నెలలో మరోసారి ఆ పనులకు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ రోడ్డు కూటమి ప్రభుత్వంలో మంజూరైతే దానికి సంబంధించిన ఉత్తర్వులను విలేకర్లకు చూపించాలని, తద్వారా ప్రజలకు తెలియచేయాలని కోరారు. ఈ కూటమి ప్రభుత్వంలో ఉపాధిహామీ ద్వారా సాలూరు, పాచిపెంట, మక్కువ గిరిజన మండలాల్లో ఒక్క పని కూడా మంజూరు చేయలేదని, గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు నేడు పల్లె పండుగ అంటూ సొంత డబ్బాలు కొట్టుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్ సీదరపు నూకయ్య, ఆదివాసీ జేఏసీ అడ్వైజర్ నిమ్మక అన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్తకుప్పలే..



ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త

పాలకొండ:

నగర పంచాయతీలో రోజు రోజుకూ చెత్త పేరుకుపోతోంది. ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేయించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రహదారులపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కనీసం చెత్త కుండీల్లోని చెత్తను కూడా సిబ్బంది తీయడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఆర్డీఓ, ఎంపీడీఓ కార్యాలయాల ఎదురుగా ఉన్న చెత్త కుండీలు పూర్తిగా నిండిపోయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.